**పోటీపరీక్షల్లో ఆర్థిక భావనలూ, వాటి ప్రభావాల గురించి ప్రశ్నలు వస్తుంటాయి. 'యానిమేషన్ స్పిరిట్స్' మొదలైన అంశాలను గ్రహించి అవగాహన పెంచుకోవటం అభ్యర్థులకు అవసరం!**

# ఆర్థిక వ్యవస్థకు ఊపునిచ్చే వైఖరి

'ఏదయితే అదవుతుంది. ఇంకా ఏం మునగాలి? అప్పు తెచ్చయినా వ్యాపారం మొదలు పెట్టేస్తా'- ప్రకటించాడు కొండల్రావు.

'ఏమిటో అంత ఊపు? చూడబోతే మిర్చికి మంచి రేటు వచ్చినట్లుందే. అయినా.. ఎంతొచ్చినా అప్పు తప్పట్లేదని మొన్ననే వాపోయావ్'- రామారావు ఆరా తీశాడు.



నూతక్కి విజయశేఖర్
www.teluguvartalu.com

'అవును. ఇప్పుడు మిర్చికి మంచి గిరాకీ. అప్పులు తప్పనిదీ నిజమే. అయినా సరే, వ్యాపారం పెడతా. ధైర్యం, నమ్మకం లేకపోతే ఏమీ చేయలేమని నిర్ణయించుకున్నా!'

'అబ్బో! అయితే, నీలో ఇప్పుడు యానిమల్ స్పిరిట్స్ ఉచ్ఛ దశలో ఉన్నట్లే. ఇక ఏం చెప్పినా ఆగవు'

'అదేంటి, అంత మాటనేశావు? కుటుంబం కోసం దురలవాట్లు మానేశా. సేద్యం చేస్తున్నా. ఇప్పుడు సానుకూల దృక్పథంతో వ్యాపారం చేస్తానంటుంటే మెచ్చడం మాని జంతు స్ఫూర్తితో పోలిస్తే ఎలా చెప్పు? '

'నీ దుంప తెగ, చంపేశావ్ కదా! యానిమల్ స్పిరిట్స్ అంటే నువ్వనుకున్నది కాదు. ఆర్థిక శాస్త్రంలో అదొక అవగాహన'.

'అవునా? ఎకనమిక్స్‌లోకి జంతువులు కూడా చొరబడ్డాయా..!'


'అదే కాదంటోంది. మాజీ ప్రధాని మన్మోహన్ 'మీ యానిమల్ స్పిరిట్స్‌ను పునరుద్ధరించండి!' అని బడా వ్యాపారస్థులకు పిలుపు కూడా ఇచ్చారు'

'ఓ పక్క యానిమల్ అంటూ జంతువు కాదంటే ఎలా? పైగా ప్రధాని కూడా అన్నారంటున్నావ్. కాస్త వివరించు'

'ఆర్థికవేత్త సర్ జాన్ మేనార్డ్ కీన్స్ ద్వారా ఆ పదం బాగా వాడుకలోకి వచ్చింది. ఆయనకు ముందు కూడా ఉన్నా, గొప్ప అర్థాన్ని తెచ్చింది మాత్రం ఆయనే. మార్కెట్ పరిస్థితుల పట్ల బాగా నమ్మకం పెట్టుకుంటూ వ్యాపారులూ, సంస్థలూ, మదుపరులూ తమ ఆర్థిక చర్యల్ని వేగవంతం చేసి ఆర్థికవ్యవస్థకు ఊపు తేవడాన్ని 'యానిమల్ స్పిరిట్స్'గా కీన్స్ చెప్పాడు'

'బాగుంది కానీ ఇందులోకి జంతువులు ఎలా వచ్చాయి? '

'అక్కడికే వస్తున్నా. జంతువులకి ఆలోచన ఉండదు. చేసే పని లాభమా, నష్టమా అని ఊహించే జ్ఞానం ఉండదు. ఏది తోస్తే అది అప్పటికప్పుడే అక్కడికక్కడే చేసేస్తాయి. ఇటువంటి వైఖరిని సూచిస్తూ 'యానిమల్ స్పిరిట్స్' పదాన్ని కీన్స్ ప్రయోగించాడు. దీన్నే ఇప్పుడు బిజినెస్ కాన్ఫిడెన్స్ అని అంటున్నారు'




'కీన్స్ సంగతేమో గానీ, నేను మాత్రం అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను'.

'నువ్వే కాదు. ఏ వ్యాపారీ/ సంస్థా ఆలోచన లేకుండా పెట్టుబడులు పెట్టరు. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ... చక్రగతిలో ఉత్థాన పతనాల గుండా ప్రయాణిస్తుందని చెప్పాను కదా. ఉత్థానదశలో (బూమ్) పెట్టుబడిదారీ చోదకశక్తులు ఊపు (బిజినెస్ కాన్ఫిడెన్స్)తో ఉంటాయి. ఇదే చక్రగతికి కారణమని కీన్స్ అంచనా. దీనిపై భేదాభిప్రాయాలు ఉన్నాయనుకో'

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 2012లో కొద్ది నెలల పాటు ఆర్థిక మంత్రిత్వశాఖను నిర్వహించారు. అప్పటికి భారత ఆర్థికవ్యవస్థలో పతన దశ ఆరంభమైంది. జీడీపీ పడిపోతోంది. బ్రిక్స్ కూటమిలో భారత్ మాత్రమే అత్యంత బలహీనంగా ఉందని వాల్‌స్ట్రీట్ పండితులు తీర్మానిస్తున్నారు. ఎఫ్ఐఐలు దేశం విడిచి పారిపోతున్నాయి. క్రెడిట్ రేటింగ్ సంస్థలు భారత్ క్రెడిట్ (సావరిన్ బాండ్ల) రేటింగ్‌ను వరసపెట్టి తగ్గిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత సంస్థలు/ వ్యాపారులు తమ 'యానిమల్ స్పిరిట్స్'ను పునరుద్ధరించాలనీ, పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థకు ఊపు తేవాలనీ వేడుకున్నారు. నిరాశావాదాన్ని వీడి, ఆశావాదంతో భారత ఆర్థికవ్యవస్థపై నమ్మకంతో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం చేయాలని కోరారు.

**'యానిమేషన్ స్పిరిట్స్' అనేది లాటిన్ పదం 'స్పిరిటస్ యానిమలెస్' నుంచి పుట్టింది.**

జాన్ కీన్స్ తన పుస్తకం 'ద జనరల్ థియరీ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంటరెస్ట్, మనీ'లో 'యానిమేషన్ స్పిరిట్స్' ప్రసక్తి తెచ్చారు. లాటిన్ పదం 'స్పిరిటస్ యానిమలెస్' నుంచి ఈ పదం పుట్టింది. దీని అర్థం 'మానవుడి ఆలోచనలూ, భావనలు, చర్యలను ప్రోద్బలించే ఉల్లాసం' అని. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ, చక్రగతిలో నాలుగు దశల గుండా ప్రయాణిస్తుందని గతంలో చెప్పుకున్నాం. ఈ చక్రగతికి పెట్టుబడిదారుల/ వ్యాపారుల/ సంస్థల వ్యాపార స్ఫూర్తిలో హెచ్చుతగ్గులే కారణమని కీన్స్ భావించాడు. ఆర్థిక పరిస్థితిపై అనుమానాలు, నిరాశ, నిస్పృహ లాంటి భావనలను పక్కకు నెట్టి ఆర్థికచర్యలకు ఉపక్రమింపజేసే వ్యాపార నమ్మకాన్ని (బిజినెస్ కాన్ఫిడెన్స్) ప్రధాన ఆర్థిక చోదకశక్తిగా ఆయన పరిగణించాడు. దీన్ని కన్స్యూమర్ కాన్ఫిడెన్స్‌గా కూడా పత్రికలు చెబుతుంటాయి.

కీన్స్ సిద్ధాంతం మానవుడి భౌతిక అవసరాలే అతనిని ఆర్థిక కార్యకలాపాలకు పూనుకునేలా చేస్తుందన్న సహజ సూత్రాన్ని విస్మరిస్తుంది. అందువల్ల ఈ అవగాహనపై పలువురికి విభేదం ఉంది. అయినప్పటికీ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని వివిధ అంగాలు (నేతలు, మంత్రులు, పత్రికలు, ఆర్థికవేత్తలు మొ.) బిజినెస్ కాన్ఫిడెన్స్‌ను ప్రధాన చోదకశక్తిగా ఇప్పటికీ పరిగణిస్తున్నాయి. తాత్వికంగా చూస్తే ఇది భావవాద అవగాహన.

సరుకులు- సేవల అమ్మకాలపైనా, లాభనష్టాలపైనా సామాజికార్థిక శక్తులు (పెట్టుబడిదారులు, వినియోగదారులు) నిరంతర అంచనాలు వేసుకుంటూ ఆర్థిక చర్యలకు పూనుకుంటారు. ఆశావాదం/ నమ్మకంతో ఉన్నపుడు అప్పటికపుడు నిర్ణయాలు తీసుకుని ఆర్థిక కార్యకలాపాల్లోకి దిగుతారు. కొత్త వ్యాపారం మొదలు పెట్టడమో, ఉన్న వ్యాపారంలోనే పెట్టుబడి పెంచి ఉత్పత్తి పెంచడమో చేస్తారు. ఇలా ఊపుతో నిర్ణయాలు తీసుకునే పరిస్థితిని బిజినెస్ కాన్ఫిడెన్స్‌గా కొలవడం ప్రారంభించారు.

ఇది ఉచ్ఛదశలో ఉంటే ఇతర స్థూల ఆర్థిక ప్రమాణాలు (జీడీపీ, వృద్ధిరేటు, ఉపాధి, లాభాలు, ద్రవ్యోల్బణం, ధరలు, ఫిస్కల్ డెఫిసిట్) ఉచ్ఛదశలో ఉంటాయని మార్కెట్ ఎకానమీ పండితులు భావిస్తారు.

ఈ అవగాహనలో ప్రజల కొనుగోలు శక్తికి స్థానం ఉండదు. సరుకులు, సేవలు మార్కెట్‌లో చెలామణి కావడానికి వినియోగదారుల కొనుగోలు శక్తి ప్రధాన వనరు. దీనికి స్థానం లేని అవగాహన సహజంగానే పాక్షిక పరిశీలన అవుతుంది. ఉదాహరణకు మార్కెట్ ఎకానమీ పండితుల ప్రకారం- జీడీపీ క్షీణించినపుడు ద్రవ్యోల్బణం కూడా తక్కువగా ఉండాలి. కానీ భారత జీడీపీ అతి తక్కువగా ఉన్నప్పటికీ గత మూడు నాలుగేళ్లుగా ద్రవ్యోల్బణం మొండిగా అధిక స్థాయిలో కొనసాగుతోంది. ఈ పరిస్థితికి వివిధ కారణాలు చెప్పడమే కానీ పరిష్కారాలు ఇవ్వరు.